www.kalamdaily.com

Follow on: Kalamtelugu

# కలం

ప్రజల గళం...

27-02-2026, శుక్రవారం పేజీలు: 2

360° SINGLE TOPIC

లిక్కర్ కేసు.. క్లీన్‌చిట్



ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కల్వకుంట్ల కవితపై వచ్చిన ఆరోపణలు ఆమె రాజకీయ జీవితంలోనే ఒక మచ్చ. సొంత పార్టీలోనే (బీఆర్ఎస్) గ్యాప్ పెరిగింది. నేతల నుంచి వివక్ష ఎదుర్కొన్నారు. పార్టీకి మరికి అంటించి ఓడిపోయేందుకు కారణమయ్యారనే అనేక విమర్శలను భరించారు. చివరికి బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు ఆ కేసు పరోక్షంగా ఒక కారణమైంది. బండి సంజయ్ లాంటివారు 'లిక్కర్ క్వీన్' అన్నారు. ఇంకొందరు 'లిక్కర్ దందా' అన్నారు.

ఇప్పుడు అదంతా గత చరిత్ర! ఆ కేసులో ఆమె ప్రమేయం లేదంటూ రౌస్ ఎవెన్యూ స్పెషల్ కోర్టు తీర్పు ఇచ్చింది. నిర్దోషిగా పేర్కొన్నది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను కొట్టేసింది. పొలిటికల్ కెరీర్‌లో కవిత ఊహించని మలుపు ఇది. సొంతంగా రాజకీయ పార్టీ పెడుతున్న తరుణంలో ఈ తీర్పు రావడం ఆమెకు బిగ్ రిలీఫ్. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఇంతకాలం చేసిన ఆరోపణలకు ఆమె ఇవ్వబోయే కౌంటర్ ఏంటి?.. 'కడిగిన ముత్యం'లా బయటకొస్తుందని అప్పట్లోనే కామెంట్ చేసిన కేసీఆర్ ఇప్పుడు ఎలా స్పందిస్తారు?.. సస్పెన్షన్ వేటు ఎత్తివేసి పార్టీలోకి ఆహ్వానిస్తారా?.. ఆమె వెళ్లేందుకు సిద్ధమవుతారా?.. ఇంతకాలం విమర్శించినవారి నోళ్లు మూయించేందుకు కవిత అనుసరించబోయే స్ట్రాటజీ ఏంటి?.. వీటిపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..

తెలంగాణ బ్యూరో, కలం

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు..

# క్లీన్ క్వీన్



కవిత నిర్దోషి.. స్పెషల్ కోర్టు సంచలన తీర్పు

సీబీఐ చార్జిషీట్ కొట్టివేత.. ఆధారాలు లేవని వెల్లడి

కేజ్రీవాల్ సహా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకూ క్లీన్‌చిట్




## ఎలాంటి రుజువులు లేవు



"ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ రూపకల్పనలో అవకతవకలు, అవినీతి జరిగిందనడానికి ఎలాంటి ఆధారాల్లేవ్. మద్యం వ్యాపారుల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ముడుపులు అందాయన్న ఆరోపణలకూ సాక్ష్యాధారాల్లేవ్. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో నిందితులుగా పేర్కొన్న 23 మందిపై నమోదు చేసిన అభియోగాలకు తగిన రుజువులు లేవు. ఈ కేసు దర్యాప్తు మొత్తం అప్రూవర్‌లు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే జరిగింది. లిక్కర్ పాలసీ రూపకల్పనలో కుట్ర జరిగిందన్న సీబీఐ వాదనకు తగిన ఆధారాలేవీ లేవు. సీబీఐ వాదనలన్నీ ఊహలమీద ఆధారపడి ఉన్నాయి. ఇవి న్యాయ పరిశీలనలో (జ్యుడిషియల్ రివ్యూ) నిలబడవు. నిందితులను అప్రూవర్లుగా మార్చి వారి స్టేట్‌మెంట్ల ఆధారంగా చార్జిషీట్లలో నమోదు చేసిన అభియోగాలను ఆమోదించడమంటే రాజ్యాంగ విరుద్ధమైన చర్యే. అందుకే ఈ కేసును కొట్టేస్తున్నాం. చార్జిషీట్‌ను తిరస్కరిస్తున్నాం."

- తీర్పులో సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి జితేందర్ సింగ్



## నేను చెప్పిందే నిజమైంది

చివరికి న్యాయమే గెలిచింది: కవిత

ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు

కడిగిన ముత్యంలా బయటకొచ్చానని వ్యాఖ్య

రాజకీయ దురుద్దేశంతోనే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు పెట్టారని, ఆ విషయం తాను మొదటి నుంచీ చెబుతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పుతో తాను చెప్పిందే నిజమైందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తాము పెట్టుకున్న నమ్మకం వమ్ముకాలేదని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పు అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. లిక్కర్ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకొచ్చానని ఆమె పేర్కొన్నారు. క్లీన్‌చిట్ రాగానే అమ్మ ఆశీర్వాదం తీసుకున్నానని చెప్పారు. ''ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని నేను మొదటి నుంచీ చెబుతున్నాను.. ఇప్పుడదే నిజమైంది. ఇందులో నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అనేకసార్లు చెప్పాను.. అలాగే వచ్చాను. కష్టకాలంలో నాకు అండగా నిలిచిన నా భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, అత్తామామలు, బంధువులు, జాగృతి కార్యకర్తలకు కృతజ్ఞతలు" అంటూ ఎమోషనల్ అయ్యారు. ఐదున్నర నెలల పాటు తనను జైల్లో ఉంచి, కుటుంబానికి దూరం చేసి.. తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ''మూడేండ్ల పాటు నాపై ఇష్టమున్నట్టు కామెంట్లు చేశారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పెట్టి హింసించారు. పబ్లిక్ మీటింగ్స్‌లో దుర్భాషలాడారు. ఇప్పుడు వాళ్లందరూ ఏం జవాబు చెప్తారు?" అని ప్రశ్నించారు.

## కేసు మొదలైంది ఇలా..

- ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో అవినీతి జరిగిందని, మద్యం వాపారుల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ముడుపులు అందాయని అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్ వీకే సక్సేనా సీబీఐకి ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా 2022 జూలై 20న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.
- ఢిల్లీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ మాజీ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ సింగ్ అనే అధికారిని సీబీఐ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పన సమయంలోనే మద్యం దుకాణాల లైసెన్సుల జారీతో ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా, పబ్లిక్ సర్వెంట్లకు వాటాలు అందేలా ప్రయత్నించారని సీబీఐ ఆరోపణలు చేసింది.
- దర్యాప్తులో భాగంగా ఢిల్లీ అప్పటి సీఎం అర్వింద్ కేజ్రీవాల్, అప్పటి డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తదితరులందరినీ సీబీఐ విచారించింది. పలువురిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించింది. కొందరు జైలుకు వెళ్లారు.
- సీబీఐ పేర్కొన్న 23 మంది నిందితులకు తాజాగా రౌస్ ఎవెన్యూలోని సీబీఐ స్పెషల్ కోర్టులో క్లీన్ చిట్ వచ్చింది.



## న్యాయం గెలిచింది

మేం ఏ తప్పూ చేయలేదు.. చేయం: కేజ్రీవాల్

కోర్టు తీర్పు తర్వాత తీవ్ర భావోద్వేగం

ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. లిక్కర్ స్కామ్ కేసులో తనతో పాటు పార్టీ నేతలు నిర్దోషులని తేలడంతో ఆయన ఇంట, పార్టీ శ్రేణుల్లో సంబురాలు మిన్నంటాయి. తీర్పు తర్వాత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. వెంటనే ఆయనను భార్య సునీత, సీనియర్ నేత మనీష్ సిసోడియా ఓదార్చారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్.. న్యాయం గెలిచిందంటూ నినాదాలు చేశారు. ''మేం ఏ తప్పు చేయలేదు. ఎప్పుడూ చేయం కూడా! మేం కట్టర్ ఇమాందార్లం! కావాలని మమ్మల్ని రాజకీయ కక్షసాధింపులతో వేధించారు. ఇన్నాళ్లూ నిజాయితీగానే బతికాను.. ఇకపై కూడా అలాగే ఉంటాను. నేను అవినీతిపరుణ్ని కాదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

అన్నకు చెల్లి స్ట్రాంగ్ కౌంటర్ 2వ పేజీలో

కలం

27-02-2026, శుక్రవారం

360° SINGLE TOPIC

# లిక్కర్ కేసు.. క్లీన్‌చిట్

02



## వీళ్లకే క్లీన్‌చిట్..

1. కుల్దీప్ సింగ్
2. నరేందర్ సింగ్
3. విజయ్ నాయర్
4. అభిషేక్ బోయిన్‌పల్లి
5. అరుణ్ రామచంద్ర పిళ్లై
6. ముత్తా గౌతమ్
7. సమీర్ మహేంద్రు
8. మనీశ్ సిసోడియా
9. అమన్‌దీప్ సింగ్ ధాల్
10. అర్జున్ పాండే
11. గోరంట్ల బుచ్చిబాబు
12. రాజేశ్ జోషి
13. దామోదర్ ప్రసాద్ శర్మ
14. ప్రిన్స్ కుమార్
15. అర్వింద్ కుమార్ సింగ్
16. చన్‌ప్రీత్ సింగ్ రాయత్
17. కల్వకుంట్ల కవిత
18. అర్వింద్ కేజ్రీవాల్
19. దుర్గేశ్ పాఠక్
20. అమిత్ అరోరా
21. వినోద్ చౌహాన్
22. ఆశిశ్ చంద్ మాథుర్
23. శరత్ చంద్రారెడ్డి



## హైకోర్టుకు సీబీఐ!

ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసేందుకు సీబీఐ సిద్ధమవుతున్నది. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు రెడీ అవుతున్నది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో తగిన ఆధారాలు ఉన్నాయని.. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తామని సీబీఐ వర్గాలు తెలిపాయి.

ఢిల్లీ లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవితపై ఆరోపణలు రావడంతో సీబీఐ, ఈడీ అధికారులు ఆమెను పలుమార్లు విచారించారు. చివరకు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఐదున్నర నెలల తర్వాత ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు.



## కవిత విచారణ జరిగిందిలా..

**2022 డిసెంబర్ 11:** సీబీఐ అధికారులు హైదరాబాద్ వచ్చి కవిత నివాసంలో ఉదయం మొదలు రాత్రి వరకు ఏడు గంటల పాటు ఆమెను ప్రశ్నించారు.

**2023 మార్చి 11:** ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో సుమారు తొమ్మిది గంటల పాటు కవిత విచారణ. స్టేట్‌మెంట్ రికార్డు.

**2023 మార్చి 22, 23:** వరుసగా రెండు రోజుల పాటు ఢిల్లీలోని హెడ్ క్వార్టర్‌లో ఈడీ అధికారుల విచారణ.

**2024 మార్చి 15:** హైదరాబాద్‌లోని కవిత నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన అనంతరం సాయంత్రానికి అరెస్టు. వెంటనే విమానంలో ఢిల్లీకి తరలింపు.

**2024 మార్చి 16:** ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో కవితను హాజరుపరిచిన ఈడీ అధికారులు. వారం రోజుల పాటు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతి.

**2024 మార్చి 26:** కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్. వెంటనే తీహార్ జైలుకు షిఫ్ట్.

**2024 ఏప్రిల్ 11:** ఈడీ కేసులో తీహార్ జైల్లో ఉన్న కవితను లాంఛనంగా అరెస్టు చేసిన సీబీఐ.

**2024 ఏప్రిల్ 12:** ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్న సీబీఐ.

**2024 ఆగస్టు 27:** తీహార్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన కవిత.

## కవితపై వచ్చిన ఆరోపణలేంటి?:

ఢిల్లీ లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవిత సౌత్ గ్రూపు పేరుతో మద్యం వ్యాపారులతో సిండికేట్ నడిపారని, లైసెన్సుల జారీకి పొలిటికల్ లీడర్లతో లాబీయింగ్ చేశారని, అప్పట్లో ఢిల్లీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు రూ. 100 కోట్ల మేర ముడుపులు అందజేయడంలో కీలక పాత్ర పోషించారన్నది సీబీఐ, ఈడీ లేవనెత్తిన ఆరోపణలు. ఎక్సైజ్ పాలసీ డ్రాఫ్ట్ కాపీని తీసుకున్న తర్వాత కొన్ని నిబంధనలు మార్చి మద్యం వ్యాపారంలో అనుకూలమైన క్లాజ్‌లు చేర్పించారని, భారీ లాభాల్లో కొంత భాగాన్ని ఆప్ నేతలకు ప్రతిఫలంగా అందజేశారన్నది దర్యాప్తు సంస్థలు చేసిన ఆరోపణలు. ఇండో స్పిరిట్స్ కంపెనీలో అరుణ్ రామచంద్రన్ పిళ్లైను కవిత తన బినామీగా పెట్టి వాటాలు చేజిక్కించుకున్నారన్నది ఓ అభియోగం. సాక్ష్యాధారాలను పక్కదారి పట్టించేందుకు సొంత ఫోన్లను ఆమె ధ్వంసం చేశారని, డేటాను డిలీట్ చేశారని, ఐఫోన్లను రీసెట్ చేశారని దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి.

## చార్జ్‌షీట్లలోని అభియోగాలేంటి?

ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను విచారించిన సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లలో పలు అభియోగాలను నమోదు చేసింది. ప్రభుత్వ సిబ్బందికి లంచం ఇచ్చి ప్రభావితం చేశారన్న ఆరోపణలతో ఆమెపై సీబీఐ అధికారులు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7ను నమోదు చేశారు. ఐపీసీలోని సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 477-ఏ (ఫోర్జరీ) కూడా నమోదు చేశారు. మొత్తం 23 మందిలో ఆమెను ఏ-17గా చేర్చారు. ఈ కేసులో ఆప్ నేతలకు ఆమె ముడుపులు ఇవ్వడానికి దొడ్డిదారిన ప్రయత్నాలు చేశారని, మనీ లాండరింగ్ (నగదు అక్రమ చెలామణి)కు పాల్పడ్డారని పీఎంఎల్ఏలోని సెక్షన్ 3, 4 కింద అభియోగాలను ఈడీ నమోదు చేసింది. రౌస్ ఎవెన్యూ కోర్టుకు 2024 మే నెలలో ఈడీ సమర్పించిన ఆరో సప్లిమెంటరీ చార్జిషీట్‌లో ఆమెను ఏ-1గా చేర్చింది.

## లిక్కర్ క్వీన్ అంటూ అప్పట్లో బీజేపీ విమర్శలు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కల్వకుంట్ల కవితపై ఆరోపణలు వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని బీజేపీ నేతలు ఒంటికాలు మీద లేచారు. ఆమెను 'లిక్కర్ క్వీన్' అంటూ సంబోధించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మొదలు.. స్థానిక నేతల వరకు ఇవే విమర్శలు గుప్పించారు.



### సంజయ్ ఏమన్నారంటే..!

ఢిల్లీ లిక్కర్ కేసులో కవితపై వచ్చిన ఆరోపణలు, దర్యాప్తు సంస్థల (సీబీఐ, ఈడీ) విచారణ, ఆమె తీహార్ జైలుకు వెళ్ళడం.. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అప్పట్లో తీవ్ర వ్యాఖ్యలే చేశారు. "తెలంగాణ ఆడబిడ్డల గౌరవాన్ని కవిత ఢిల్లీలో తాకట్టు పెట్టారు. ఆమె తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కాదు.. 'లిక్కర్ క్వీన్'.. లిక్కర్ స్కామ్‌లో కవిత వికెట్ పడింది. త్వరలో బీఆర్ఎస్‌లో మరికొన్ని వికెట్లు పడతాయి. మద్యం వ్యాపారం చేయడం తెలంగాణ సంస్కృతేనా?.. కవిత చేసిన అక్రమ దందాలకు తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం?.." అని వ్యాఖ్యానించారు. తీహార్ జైలు నుంచి కవిత విడుదలైన సందర్భంగా కూడా.. "కాంగ్రెస్-బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ ఫలితం" అంటూ కామెంట్ చేశారు. ఈ కామెంట్లకు నిరసనగా అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.



### కిషన్ రెడ్డి ఏమన్నారంటే..!

ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టయిన సందర్భంగా అప్పట్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. "ఒక ముఖ్యమంత్రి కూతురే మద్యం కుంభకోణంలో ఉండడం ప్రజాస్వామ్యానికే 'బ్లాక్ డే'.. బంగారు తెలంగాణ మోడల్ చీప్ లిక్కర్ బిజినెస్ మోడల్‌గా మారింది... సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేసేవి.. కవితకు వీటితో నోటీసులు ఇప్పించింది బీజేపీ అంటూ కొందరు విమర్శిస్తున్నారు.. నిజానికి ఆ నోటీసులకు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది.. లిక్కర్ కేసులో కవిత పాత్ర లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ చర్చకు రాగలరా?.. ఆమె ప్రమేయం లేదని నిరూపించగలరా?.." అంటూ సవాల్ విసిరారు.

## నా కూతురు కడిగిన ముత్యం: కేసీఆర్



ఢిల్లీ లిక్కర్ కేసులో కవితపై వచ్చిన ఆరోపణలను ముఖ్యమంత్రి స్థాయిలో కేసీఆర్ తెలంగాణ భవన్‌లో 2024 మార్చిలో జరిగిన ప్రెస్ మీట్‌లో తీవ్రంగా ఖండించారు. "ఢిల్లీ లిక్కర్ కేసు ఒక అభూత కల్పన. అసలు స్కామే జరగలేదు. వంద కోట్ల ముడుపులు అని చెప్తున్నా ఒక్క పైసా కూడా దొరకలేదు. కవితను అరెస్టు చేయడం ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు చర్యే.. నన్ను ఇబ్బంది పెట్టడానికి నా కూతురిని జైలుకు పంపారు... బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని దర్యాప్తు సంస్థలను వేటకుక్కల్లా వాడుకుంటున్నది.. ఆడబిడ్డ అని కూడా చూడకుండా వేధిస్తున్నది.. కేసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నది.. ఉద్దేశపూర్వకంగా బురద చల్లుతున్నది.. ఆమె ఏ తప్పూ చేయలేదు... దర్యాప్తు సంస్థల విచారణలకు భయపడం.. న్యాయం గెలుస్తుంది.. చివరికి కడిగిన ముత్యంలా బయటకు వస్తుంది..." అని కేసీఆర్ అన్నారు.

## పార్టీ ఓటమికి కవితే కారణమంటూ ఇన్నాళ్లూ బీఆర్ఎస్ దాడి

లిక్కర్ కేసులో కవిత అరెస్ట్‌పై ఇన్నాళ్లూ బీఆర్ఎస్ నేతలు కూడా ఆమెపై మాటలతో దాడికి దిగారు. పార్టీ ఓటమికి కవితే కారణమంటూ జగదీశ్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు, బండారం బయటపెడుతామంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వంటి వారు దుయ్యబట్టారు. మరికొందరు గులాబీ లీడర్లు.. లిక్కర్ స్కామ్ అంశం ప్రజల్లోకి వెళ్లి పార్టీ ఓటమికి కారణమైందన్న అభిప్రాయాన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో వ్యక్తం చేశారు.



### మాకు నీతులు చెప్పడమేంటి?: జగదీశ్‌రెడ్డి

"బీఆర్ఎస్ పార్టీకి ఈ పరిస్థితి రావడానికి నీ లిక్కర్ పాపాలు చాలవా?.. ఇంకా మా మీద ఆరోపణలు చేస్తావా?.. ఈ కేసు కారణంగా పార్టీకి ప్రజల్లో చెడ్డపేరు వచ్చింది.. అది ఎన్నికల ఓటమిపై ప్రభావం చూపింది.. చరిత్ర లేనివారు, అక్రమ దందాల్లో ఇరుక్కున్నవారు మాకు నీతులు చెప్పడమేంటి?.." అంటూ బీఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి బహిరంగంగానే అప్పట్లో కవితపై కామెంట్లు చేశారు.



### బండారం బయటపెడతా: మాధవరం

"పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టించడానికి కంకణం కట్టుకున్నావ్.. నీ లిక్కర్ వ్యాపారమేంటో, నీ చరిత్ర ఏంటో మాకు తెలుసు.. నీ బండారాన్ని బయటపెడితే తట్టుకోలేవ్.." అని కూకట్‌పల్లి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అప్పట్లో కవితపై ఫైర్ అయ్యారు. ఆమె చేసిన పనుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. హరీశ్‌రావు లాంటి వ్యక్తుల్ని పార్టీ నుంచి బయటకు పంపేందుకు కవిత ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు.

## 'కవిత గారూ..' అంటూ అన్న ట్వీట్



### లిక్కర్ కేసు వల్లే బీఆర్ఎస్ ఓటమి..

ఢిల్లీలో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని లిక్కర్ స్కామ్ పేరుతో కుప్పకూల్చారు. ఆ ప్రచార ప్రభావంతో తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నష్టపోవాల్సి వచ్చింది. ఏదేమైనా.. కవిత గారికి కంగ్రాట్స్. ఆమెకు కోర్టులో న్యాయం జరిగింది. మా నాయకులపై నమోదైన ప్రతి కేసు కూడా అబద్ధం. రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే నిరూపితమవుతుంది. నిజం బయటికొచ్చేదాకా కాంగ్రెస్, బీజేపీలు చేసే బాధ్యతారహితమైన ఆరోపణలను చూస్తూనే ఉంటాం. అసత్య, కుట్రపూరిత కేసులను, ఆరోపణలను మీడియా ద్వారా ప్రచారం చేసి.. మా ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. దురదృష్టవశాత్తూ సాక్ష్యాల కంటే ఆరోపణలకే ప్రాధాన్యమిస్తూ, న్యాయ ప్రక్రియ కంటే మీడియా కథనాలే మిన్న అనే ధోరణి ఈ న్యూ ఇండియాలో అలవాటుగా మారిపోయింది. కానీ చివరికి న్యాయమే గెలుస్తుంది.

– కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

## 'బ్లేమ్ గేమ్ ఆపు..' అన్నకు చెల్లెలి కౌంటర్



### మీ అహంకారమే అసలు కారణం..

కేటీఆర్.. బీఆర్ఎస్ ఓటమికి నన్ను బ్లేమ్ చేయకు. దాన్ని నాపై రుద్దాలని చూడకు. కంగ్రాట్స్ చెబుతూనే ఓటమికి నన్ను కారణమనడం కరెక్టా? ప్రజలు మిమ్మల్ని వద్దన్నారని ఎందుకు ఒప్పుకోవడం లేదు? ధైర్యముంటే ఓటమిని ఒప్పుకో.. దానిపై ఆత్మవిమర్శ చేసుకో. కేవలం ఒక్క వ్యక్తి తప్పు చేస్తే బీఆర్ఎస్ ఓడిపోతదా.. మీ పార్టీ అంత వీక్‌గా ఉందా? అసలు నాపై లిక్కర్ కేసు పెట్టిందే బీఆర్ఎస్ కోసం కాదా? ఆనాడు మీలో ఒక్కరైనా నాకు అండగా నిలబడ్డారా? మీరు ఇండ్లు, ఉద్యోగాలు ఇవ్వలేదు.. వద్దన్నా దోపిడీదారులకు మళ్లీ టికెట్లు ఇచ్చారు. ఇవి కాదా పార్టీ ఓటమికి కారణాలు? అన్నింటికంటే ఎక్కువ ప్రభావం చూపింది అహంకారం అనే అంశం కదా! లిక్కర్ కేసు వల్ల కేజ్రీవాల్ ప్రభుత్వం ఓడిపోయి ఉండొచ్చు. ఎందుకంటే అక్కడ ఆయన అరెస్టు అయ్యాక ఎన్నికలు వచ్చాయి. కానీ తెలంగాణలో నేను అరెస్టు కాకముందే ఎన్నికలు వచ్చాయి. అలాంటప్పుడు బీఆర్ఎస్ ఓటమికి నేను ఎలా కారణమవుతాను? బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే. కొత్త పార్టీ పెడ్తాను.

- కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

# కొత్త పార్టీకి భారీ మైలేజ్!

## తాజా తీర్పుతో కవితకు బిగ్ రిలీఫ్ జాగృతి కార్యకర్తల సంబురాలు

ఢిల్లీ లిక్కర్ కేసులో సీబీఐ స్పెషల్ కోర్టు వెలువరించిన తీర్పు కవితకు భారీ రిలీఫ్. కొత్త రాజకీయ పార్టీతో జనంలోకి రావాలనుకుంటున్న ఆమె ఒంటరి పోరాటానికి ఊహించని మైలేజ్. సీబీఐ చార్జిషీట్‌ను కోర్టు కొట్టేయడంతో కవిత భావోద్వేగానికి గురయ్యారు. లిక్కర్ స్కామ్‌లో ఆమె ప్రమేయం ఉన్నట్లు సీబీఐ, ఈడీ ఆరోపించడం, ఎంక్వైరీ చేయడం, కస్టడీలోకి తీసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేయడం, పార్టీకి డ్యామేజ్ అయిందని బీఆర్ఎస్‌లో కామెంట్లు రావడం, ఇటీవల పార్టీ నుంచి సస్పెండ్ కావడం.. ఇవన్నీ గతం. తాజాగా రౌస్ ఎవెన్యూ కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటించడంతో ఆమె పెట్టబోయే కొత్త పార్టీకి కలిసొస్తుందన్నది జాగృతి కార్యకర్తల అభిప్రాయం. ఇప్పటికే బీఆర్ ఎస్ నుంచి తెగదెంపులు చేసుకొని ప్రజలను కలుస్తున్న కవితకు ఈ తీర్పు మరింత ఉత్సాహం ఇస్తుందని వారు అంటున్నారు.

### మాయమైన 'లిక్కర్' మచ్చ కలిసొచ్చేనా?

కవిత రాజకీయ జీవితంలో పడిన 'లిక్కర్' మచ్చ రౌస్ ఎవెన్యూ కోర్టు తాజా తీర్పుతో మాయమైంది. క్లీన్‌చిట్‌తో కొత్త పార్టీ ప్లాట్‌ఫామ్ మీద ఏక కాలంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సవాలు విసిరే సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. 'కడిగిన ముత్యం', 'క్లీన్ చిట్' ట్యాగ్ లైన్లతో ఆమె ప్రజలకు దగ్గరయ్యేందుకు మార్గం సుగమమైంది. ఇంతకాలం ఆమెపై 'నిందితురాలు' అనే ముద్ర ఉండేది. ఇప్పుడు 'బాధితురాలు'గా మారిపోయింది. బెయిల్ కోసం బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేసే కుట్ర జరిగిందని, బీజేపీకి లొంగే ప్రసక్తే లేదని కరాఖండిగా చెప్పినట్లు ఇటీవల పలు సందర్భాల్లో గుర్తుచేశారు. పార్టీ సస్పెండ్ చేసినా 'డాటర్ ఆఫ్ ది ఫైటర్'గా తనను తాను అభివర్ణించుకున్నారు.

### బీఆర్ఎస్ నుంచి జాగృతిలోకి వలసలు?

కవితపై లిక్కర్ ముద్ర చెరిగిపోవడంతో ఆమె తదుపరి రియాక్షన్, ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి చర్చలు మొదలయ్యాయి. కవితకు క్లీన్ చిట్ రావడంతో ఆమె తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుతారా?.. ఆమెను బీఆర్ఎస్ అగ్రనేత ఆహ్వానిస్తారా?.. గతంలో కామెంట్లు చేసిన గులాబీ నేతలు వాటిని వెనక్కి తీసుకుంటారా?.. ఇలాంటి కామెంట్లు వస్తున్నాయి. కోర్టు తీర్పుతో కవితకు మైలేజ్ రావడంతో బీఆర్ఎస్ నేతలకు ఆమె గాలం వేసి ఆ పార్టీని నిర్వీర్యం చేస్తారనే అనుమానాలూ లేకపోలేదు. బీఆర్ఎస్ వర్సెస్ కవిత పొలిటికల్ ఫైట్‌లో ఎవరిది పైచేయి కానున్నది?.. ఎవరి వ్యూహం ఎలా ఉండనున్నది?.. ఇతర పార్టీలకు కవిత ఎలాంటి కౌంటర్ ఇవ్వబోతున్నారు?.. వీటన్నింటికీ రానున్న రోజుల్లో క్లారిటీ రానున్నది.



## సత్యమేవ జయతే

–కవిత కొడుకు ఆదిత్య

**కవితకు క్లీన్‌చిట్ దక్కడంతో ఆమె కొడుకు ఆదిత్య దేవనపల్లి మీడియాతో మాట్లాడాడు. తల్లి కవితతో కలిసి తీవ్ర భావోద్వేగంతో స్పందించాడు. "లిక్కర్ స్కామ్ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. తెలంగాణ ప్రజలందరికీ ఈ విషయం తెలుసు. ఇప్పుడు కోర్టు కూడా క్లీన్ చిట్ ఇచ్చింది. సత్యమేవ జయతే" అంటూ నినదించాడు.**



కోర్టు తీర్పు తర్వాత కవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న జాగృతి కార్యకర్తలు